బీడీ కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3 : మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. ఇంటర్నేషనల్ క్యాన్సర్ డే సందర్భంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని దేశాయ్ బీడీ కంపెనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జడ్జి మట్లాడుతూ బీడీ కార్మికులకు క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు బీడీలు తయారుచేసే సమయంలో మాస్క్‌లు ధరించాలని, చేతులకు గ్లౌజ్ వేసుకోవాలని సూచించారు. బీడీలు చుట్టేటప్పుడు పిల్లలకు దూరంగా ఉండాలని, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కవిత

‘పది’లో పది జీపీఏ సాధించాలి

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కవిత

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 3 : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా 10కి..10 జీపీఏ సాధించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కవిత సూచించారు. గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం గజ్వేల్ డివిజన్‌లోని ఎస్సీ హాస్టళ్లలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ‘ప్రేరణ – శిక్షణ’ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవిత హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. నైతిక విలువలు, సమాజం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనతరం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సత్యనారాయణ, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్ టెస్టులో మొదటి స్థానంలో నిలిచి బహుమతి అందుకుంటున్న నవ్య

టాలెంట్ టెస్టులో మెరిసిన నవ్య

కొమురవెల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని గురువన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీడల నవ్య శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియం నుంచి మొదటి స్థానంలో నిలిచిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో నవ్య పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నవ్యకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కొండపాకలో ఆయిల్‌పామ్ రైతులకు సూచనలిస్తున్న డీహెచ్ఎస్‌వో సునీత

ఆయిల్ పామ్ సాగుతో అధిక రాబడి

- డీహెచ్ఎస్‌వో సునీత

కొండపాక, ఫిబ్రవరి 3 : ఆయిల్‌పామ్ సాగుతో అధిక రాబడి సాధించవచ్చని డీహెచ్ఎస్‌వో సునీత సూచించారు. శనివారం కొండపాక గ్రామ శివారులో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీహెచ్ఎస్‌వో మాట్లాడుతూ తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలకు ప్రతిరోజూ రెండు గంటల పాటు నీటిని అందించాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి రసాయన ఎరువులను పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు ఎలాంటి రోగాలు రావన్నారు. ఆమె వెంట ఉద్యానవనశాఖ అధికారి పాండరి, డీసీవో సత్తయ్య, ఆయిల్ ఫెడ్ అధికారులు శంకర్, హరీశ్, రైతులు తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

సిద్దిపేటలో సమావేశానికి హాజరైన కోర్టు డ్యూటీ సిబ్బంది

మాట్లాడుతున్న సీపీ అనురాధ

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3: పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ సిబ్బందికి సూచించారు. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో కోర్టు డ్యూటీ విధులు నిర్వహించే సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. సీపీ అనురాధ మాట్లాడుతూ.. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో శిక్షల శాతం పెంచాలని.. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. నేరస్తులకు కేసుల్లో శిక్షలు పడితేనే నేరాలు తగ్గుముఖం పడుతాయన్నారు. కోర్టు డ్యూటీ వర్టికల్‌లో పారదర్శకంగా విధులు నిర్వర్తించే వారికి రివార్డులు, అవార్డులు అందజేస్తామన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జి షీట్ వరకు సక్రమంగా ఉండేలా మానిటర్ చేయాలని చెప్పారు. కోర్టు డ్యూటీ అధికారులు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి కన్విక్షన్ రేటు పెంచాలని సూచించారు. ప్రతి కోర్టు డ్యూటీ అధికారి నీతి నిజాయితీగా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం కోర్టు విధుల్లో ప్రతిభ కనబర్చిన రామరాజు, విఠల్, సంజీవ్, శ్రీనివాస్, సూరజ్, వెంకట్‌లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాయజ్ఞంలో అందరూ పాల్గొనాలి

గజ్వేల్, ఫిబ్రవరి 3: వెయికోట్ల లిఖిత మహాయజ్ఞంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు కోరారు. శనివారం గజ్వేల్‌లోని అద్దాల మందిరం వద్ద సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ నామాన్ని మించిన మహామంత్రం మరొకటి లేదన్నారు. ఈ మహాయజ్ఞంలో ప్రతిఒక్కరూ దిగ్విజయంగా పాలుపంచుకోవాలన్నారు. ఇప్పటివరకు ఎంతో మంది వృద్ధులు పాల్గొని రామనామాలను లిఖించారని తెలిపారు.

అద్దాల మందిరం వద్ద పూజలు చేస్తున్న రామరాజు

పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3: గ్రామంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో జగదేవ్‌పూర్ ప్రత్యేకాధికారి వేదవతి సిబ్బందికి సూచించారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామంలో వర్తక వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి దుకాణాదారుడు తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. హోటల్స్‌లో ప్లాస్టిక్ నిషేధాజ్ఞలు చేపడుతామన్నారు. సమావేశంలో ఎంపీవో శ్రీనివాసవర్మ, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ మారెడ్డి, సిబ్బంది బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఎస్సై వినయ్‌సాగర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి ప్రజలకు వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులను వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు తెలిపారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యురాలు పచ్చిమడ్ల అంజనీదేవి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల కిష్టయ్య, శివగారి అంజయ్య, యాదగిరి, రామగల్ల బాబు, చింతల పరశురాములు, పచ్చిమడ్ల సిద్ధిరాములు, బూరగోని తిరుపతి, తుమ్మలపల్లి సంజీవులు, బుడిగె వెంకట్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

కొమురవెల్లి, ఫిబ్రవరి 3: మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలంగాణ ఫిషరీష్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్, ప్రకృతి పర్యావరణ సంస్థ సీఈవో మూగ జయశ్రీ తెలిపారు. శనివారం కొమురవెల్లి మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ(ఎస్ఫ్ఏసీ) సహకారంతో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఫిషరీష్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఏర్పాటులో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ సహకారంతో ఏర్పాటైన మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలన్నారు. వీటి ద్వారా దళారీ వ్యవస్థను నియంత్రించవచ్చన్నారు. ప్రతి మత్స్యకారుడు సంఘాల్లో చేరాలని ప్రకృతి పర్యావరణ సంస్థ ప్రెసిడెంట్ మాధవరావు కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస భిక్షపతి, చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, ప్రకృతి పర్యావరణ సంస్థ మత్స్యకార సంఘాల ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నారదాసు ఈశ్వర్, మిట్టపల్లి తిరుపతి, కొమురవెల్లి ఫిషరీష్ సొసైటీ అధ్యక్షుడు గొల్లపల్లి బాలయ్య, తాజా మాజీ సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య, ఆయా గ్రామాల మత్స్యకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3: సైబర్ నేరాలతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. శనివారం మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ పాఠశాలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకుసాగాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం షీటీమ్ పనిచేస్తుందని, ఎవరైనా వేధిస్తే 8712667434 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కనకయ్య, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఉమాశశి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 3 : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి అందజేశారు. తొలిమెట్ట కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో చదువులో వెనుకబడిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి చదువు చెబుతున్న 15 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాడ్జీలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కస్తూరిబాయి, జయరాజ్, వలంటీర్లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 3 : ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని, దామాషా ప్రకారం అన్నిరంగాల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మిరుదొడ్డిలో ముదిరాజ్ కుల సంఘం సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయన్నారు. సమావేశంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు విద్యాసాగర్, నర్సింహులు, శివకుమార్, బైరయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

గజ్వేల్, ఫిబ్రవరి 3: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన గజ్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. సీఐ సైదా వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన గుడిసె స్వామి(24) రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఇది చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ రమేశ్, సీఐ సైదాలు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇండ్లల్లో చోరీ

- నగదు, నగలు ఎత్తుకెళ్లిన నిందితులు

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 3: తాళం వేసిన రెండిండ్లలో దుండగులు చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. దుబ్బాక పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విభూతి సాయికృష్ణ, మర్కంటి అంజయ్య వారి ఇండ్లకు తాళాలు వేసి వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. దొంగలు శుక్రవారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. సాయికృష్ణ ఇంట్లో రూ.14 వేల నగదు, తులం బంగారం, అంజయ్య ఇంట్లో తులం బంగారం, 35 తులాల వెండి, రూ.7 వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం బాధితులు ఇంటి వచ్చి చూడగా, సామగ్రి అంతా చిందరవందరగా పడి ఉంది. దొంగతనం జరిగిందని గ్రహించి వెంటనే పోలీసులు సమాచారం అందజేశారు. ఘటనాస్థలాన్ని పోలీసులు సందర్శించి క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

గజ్వేల్, ఫిబ్రవరి 3: దేశవ్యాప్తంగా రైతులకు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందనబోయిన ఎల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్‌ను షేర్ మార్కెట్‌లో పెట్టే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు సంయుక్తంగా కిసాన్ మోర్చాను రైతు సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు శివలింగకృష్ణ, రాజు, ఏఐటీయూసీ నాయకులు పోచయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3 : బహుజన సాహిత్య అకాడమీ వారు అందజేయనున్న జాతీయ స్థాయి అవార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి రమేశ్ సూచించారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాహిత్య పరిరక్షణకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏటా ఉద్యమకారులు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థలకు జాతీయ స్థాయి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రజాక్, శేఖర్, సతీశ్, లక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురువన్నపేటలో వాకథాన్ ర్యాలీ

కొమురవెల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని గురువన్నపేటలో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘వాకథాన్-2024’ అనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఎఫ్‌వీవో, వాటర్ షెడ్ కమిటీ, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వరంగల్ రీజియన్ కో-ఆర్డినేటర్ మల్లికార్జున్ మాట్లాడుతూ ఎమ్మోపీ డిక్లరేషన్ చేయడంతోపాటు వరంగల్ రీజియన్‌లో 4మండలాల నుంచి 242 మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చామన్నారు. భవిష్యత్‌లో ఎఫ్‌పీవో బలోపేతం చేస్తామన్నారు. సీఈవో ఝాన్సీ, ఎఫ్‌పీవో సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయాన్ని గొర్రెలతో దిగ్బంధిస్తాం

గజ్వేల్, ఫిబ్రవరి 3: గొల్ల, కుర్మల అభ్యున్నతి కోసం గతంలో తీసిన డీడీలకు సంబంధించిన గొర్రెలను ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో గజ్వేల్ ఆర్డీవో కార్యాలయాన్ని గొర్రెలతో దిగ్బంధిస్తామని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రవీందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి బాబుయాదవ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో గొల్ల, కుర్మలు డీడీలు తీసి ఉన్నారని, వారికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో గజ్వేల్, ములుగు మండలాల అధ్యక్షులు కనకరాజు, నూనె వెంకటేశ్‌యాదవ్, సంఘం నాయకులు భూమయ్యయాదవ్, మల్లేశ్‌మాదవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

మర్కూక్, ఫిబ్రవరి 3: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చేవెళ్ల అంజమ్మ- యాదయ్య దంపతుల కుమారుడు నరేశ్(20) శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా నరేశ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న త్రైయిముులతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సదానందాచారి

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

అక్కన్నపేట, ఫిబ్రవరి 3: సమ్మక్క-సారక్క జాతర గద్దెల వరకు సొంత ఖర్చుతో తండ్రి కందారపు మహదేవ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సదానందాచారి శనివారం గోవర్ధనగిరి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. సదానందాచారి మాట్లాడుతూ గోవర్ధనగిరిలోని సమ్మక్క-సారక్క అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్డు వేయిస్తున్నట్లు తెలిపారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం

వంగరామయ్యపల్లిలో మాజీ సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామస్తులు

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : మండలంలోని వంగరామయ్యపల్లిలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో శనివారం పాలకవర్గ సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వంగ విజయలక్ష్మి మాట్లాడుతూ ఐదేండ్లుగా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తీగుల్‌లో గ్రామ పాలకవర్గ సభ్యులకు సన్మానం

తీగుల్‌లో...

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3: తీగుల్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌తో పాటు వార్డు సభ్యుల పదవీ కాలం ముగియడంతో కేబీ ఫౌండేషన్ అధ్యక్షుడు భూమయ్య శనివారం గ్రామంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులకు విరమణ ఉంటుంది.. కానీ ప్రజా సేవకు కాదన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.